క్లుప్తంగా

రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన



బస్టాండ్ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగులు

నంద్యాల(వ్యవసాయం): సామాజిక పింఛన్ ఇవ్వాలంటూ స్థానిక బస్టాండ్ ఆవరణలో సోమవారం ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగస్తుల ఆధార్ నంబరును ఆన్‌లైన్‌లో కొట్టగానే ఎంప్లాయి అని చూపిస్తుందన్నారు. మరి అలాంటప్పుడు తమకు సంస్థ నుంచి పింఛన్ రావాలి కదా అని ప్రశ్నించారు. ఈపీఎఫ్ పెన్షన్ రూ.1400 నుంచి రూ.2 వేలలోపు వస్తుండటంతో తమ జీవనోపాధి గడవడం కష్టంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం స్పందించి సామాజిక పింఛన్ అందజేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

దొర్నిపాడు: వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీఓ సావిత్రి సూచించారు. ఈ సందర్భంగా వారు సోమవారం ఆయా కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు కావాల్సిన ధ్రువ పత్రాలు, పాసుపుస్తకాల జారీ వంటి వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే వేసవిలో నీటి ఎద్దడి రాకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

శిరివెళ్ల: యర్రగుంట్ల 2వ గ్రామ సచివాలయంలోని పంచాయతీ గ్రేడ్–5 సురేష్‌బాబును సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో రూ. 8.48 లక్షలు సామాజిక పింఛన్ల డబ్బులు బకాయిపడ్డారన్నారు. అంతేగాక విధులకు హాజరు కాకుండా ఉన్నారన్నారు. దీంతో జిల్లా కలెక్టర్ రాజకుమారి.. సురేష్‌బాబును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు.

శంభూజీ మహారాజ్‌కు చిత్రనివాళి



కోటేష్ వేసిన ఊహా చిత్రం

నంద్యాల(అర్బన్):ఛత్రపతి శివాజీ తనయుడు శంభూజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా పట్టణానికి చెందిన చిత్రకారుడు కోటేష్ శంభూజీ మహరాజ్ చరిత్ర ఘట్టాలను ఒకే చిత్రంలో చిత్రించారు. ఏ 3 డ్రాయింగ్ చార్ట్‌పై వాటర్ కలర్ పెయింట్స్‌తో శంభూజీ మహరాజ్ చేసిన యుద్ధాలు, సాహసాలను 9గంటలు శ్రమించి వేశారు. మొగల్ సామ్రాజ్య పాలకుడు ఔరంగజేబ్‌ను ఎదిరించి 9ఏళ్ల పాలనలో 120 యుద్ధాలు చేసి పరాక్రమాన్ని చూపించారు.

నిరసన ర్యాలీ

నంద్యాల(వ్యవసాయం): రాయచోటిలో హిందువులపై జరిగిన దాడులు, అక్రమ అరెస్టులకు నిరసనగా పట్టణంలో విశ్వ హిందూ పరిషత్, హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి, బీజేపీ నాయకులు సోమవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ కార్యాలయం నుంచి మొదలై శ్రీనివాస్ సెంటర్, వివేకానంద సర్కిల్, గాంధీ చౌక్ మీదుగా ఆర్‌డీఓ కార్యాలయం వరకు సాగింది. సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, కర్నూలు బసవరాజులు మాట్లాడుతూ రాయచోటిలో వీరభద్ర స్వామి పార్వేట ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులపై దాడి చేసి గాయపరిచిన ఎస్ఐను సస్పెండ్ చేయాలన్నారు. అనంతరం ఆర్‌డీఓ విశ్వనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పోలేపల్లి సందీప్, కిశోర్ కుమార్, కమ్మయ్య, నాగరాజు, విశ్వనాథ్ రెడ్డి, రామాంజనేయులు, మేడా మురళీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మోహనం.. జగన్మోహిని రూపం



పొన్నచెట్టు వాహనంపై కొలువైన జ్వాల నృసింహస్వామి



శరభ వాహనంపై కొలువై మాడవీధుల్లో సంచరిస్తున్న ప్రహ్లాదవరదుడు

- మోహినీ అవతారంలో దర్శనమిచ్చిన ప్రహ్లాదవరదుడు
- ఎగువ అహోబిలంలో వైభవంగా ఉత్సవాలు



మోహినీ అలంకరణలో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదస్వామి

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. 6వ రోజైన సోమవారం ప్రహ్లాదవరదస్వామి జగన్మోహిని అలంకరణలో వాడవాడల్లో సంచరిస్తూ భక్తులను కనువిందు చేశారు. వేకవజామున నిత్య పూజల్లో భాగంగా సుప్రభాతసేవతో స్వామి అమ్మవార్లను మేలుకొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వామిని యాగశాలలో కొలువుంచి నవకలశ స్థాపన గావించిన అనంతరం ఉత్సవమూర్తి శ్రీ ప్రహ్లాదవరదుడిని మోహినీ అలంకరణ గావించారు. అనంతరం వివిధ పుష్పాలంకరణ గావించిన పూల పల్లకీలో కొలువుంచి భక్తుల గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగారు. రాత్రి శ్రీ ప్రహ్లాదరవదస్వామి శరభ వాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు.

ఎగువ అహోబిలంలో

అహోబిలేశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజైన సోమవారం ఎగువ అహోబిలంలో వెలసిన శ్రీ జ్వాలనృసింహస్వామి పొన్నచెట్టు వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలంకరణ గావించిన పల్లకీలో కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తి శ్రీ జ్వాలనృసింహస్వామిని పొన్నచెట్టు వాహనంపై కొలువుంచి వైభవంగా గ్రామోత్సవం నిర్వహిచారు.

అహోబిలంలో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో మంగళవారం ఉదయం అభిషేకం, సాయంత్రం గజవాహన సేవ అనంతరం రాత్రి తిరుక్కళ్యాణోత్సవం ఉంటుంది. దిగువ అహోబిలంలో ఉదయం వేణుగోపాల స్వామి అలంకారం, రాత్రి పొన్నచెట్టు వాహనంపై విహరిస్తారు

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేస్తాం

- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- 'సాక్షి'తో అహోబిలం దేవస్థాన జనరల్ మేనేజర్ మురళీధరన్



ఆళ్లగడ్డ: శ్రీ అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తామని, ఇప్పటికే దేశ విదేశాల నుంచి తరలివచ్చే భక్తులకు అవసరమైన అన్ని వసతులు, సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకున్నామని అహోబిలం దేవస్థానం జనరల్ మేనేజర్ మురళీధరన్ అన్నారు. ప్రస్తుతం ఉత్సవాలు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సాక్షితో దేవస్థానం జనరల్ మేనేజర్ మురళీధరన్ మాట్లాడారు.

ప్రశ్న: భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు ఏంటి?

జవాబు: బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారు. వీరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఎగువ, దిగువ క్షేత్రాలను దర్శించుకునే భక్తుల కోసం ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశాం. వృద్ధులు, చంటి పిల్లల తల్లులు నేరుగా స్వామిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించాం. మాడ వీధి నుంచి దేవాలయం వరకు నడవలేని వారికోసం నిరంతరం 4 బ్యాటరీ వాహనాలు తిప్పుతున్నాం.

ప్ర: నీటి ఎద్దడి పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టారు ?

జ: ఉత్సవాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాం. 26 ట్యాంకర్లను ఏర్పాటు చేశాం. ఎగువలో 2, దిగువలో 4 ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశాం. అత్యవసర సమయాల్లో ఉపయోగపడేలా నీటి తొట్లు ఏర్పాటు చేశాం.

ప్ర: అన్నదాన సేవలు ఎలా జరుగుతున్నాయి?

జ: ఎగువ, దిగువలో దేవస్థానం అన్నదాన సత్రాలు నడుస్తున్నాయి. వీటితో పాటు ఈ నాలుగు రోజులు నిరంతరం అన్నదాన సత్రాలు నిర్వహించేందుకు దాతలు అనేక మంది ముందుకు వచ్చి అనుమతులు తీసుకున్నారు.

ప్ర: వైద్యశిబిరాలు ఎన్ని.. ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు ?

జ: భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఎగువ అహోబిలంలో ఒకటి, దిగువ అహోబిలంలో మూడు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాం. వైద్యాధికారుల సూచనల మేరకు అవసరమైన కొన్ని రకాల మందులను కూడా తెప్పించడం జరిగింది. వైద్య సేవలు అందించేందుకు 10 మంది డాక్టర్లు, 50 మంది ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

ప్ర: ఆధ్యాత్మికత విషయంలో అదనపు ఏర్పాట్లు ఏమైనా చేశారా ?

జ: నాలుగు వేదాలను అవపోసన పట్టిన మఠం శిష్య బృందంతో పాటు దేశం నలుమూల నుంచి వేద విద్యార్థులను బ్రహ్మోత్సవాల నిమిత్తం పిలిపించడం జరిగింది. వీరు ప్రతి రోజు ఎగువ, దిగువ క్షేత్రాల్లో వేదపారాయణం చేస్తారు.

ప్ర: పారిశుద్ధ్య విషయంలో తీసుకున్న జాగ్రత్తలు ఏమిటి ?

జ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు 200 మంది తాత్కాలిక పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాం. వీరిని 20 మంది సూపర్ వైజర్లు పర్యవేక్షిస్తుంటారు. దేవస్థాన సిబ్బంది 30 మంది ఉన్నారు. పారిశుద్ధ్య పనులకు అవసరమైన వస్తువులు, పరికరాలు వారికి అందజేశాం. అన్నదాన సత్రాలకు, హోటళ్ల నిర్వాహకులకు ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా అవగాహన కల్పించాం. దాతల సహకారంతో భక్తులకు జ్యూట్ బ్యాగులు ఉచితంగా అందజేశాం.

ముగిసిన జగజ్జననీ అమ్మవారి వార్షికోత్సవం



పూర్ణాహుతి గావిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): గత ఐదు రోజుల నుంచి పట్టణంలో జరుగుతున్న శ్రీజగజ్జననీ ఆలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం మహాచండీ యాగంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారి మూల విరాట్‌కు ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించి బలిప్రదానం చేశారు. చివరలో మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. దుర్గాఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు పుల్లయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లో శ్రీమహాజ్వాలా సుదర్శన లక్ష్మీనరసింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అహోబిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీలక్ష్మీనరసింహ సుదర్శన ఆచార్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలకరించారు. తర్వాత కల్యాణోత్సవం జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో నిర్వాహకులు సుదర్శనాచార్యులు, యాడికి శ్రీదేవి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలపై 12న చలో విజయవాడ

నంద్యాల(న్యూటౌన్): ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి ఈనెల 12వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం సీపీఎం కార్యాలయంలోని నరసింహయ్య భవన్‌లో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి బిల్లులు పడక కూలీలు అవస్థలు పడుతున్నారన్నారు. రవాణా చార్జీలు లేక పని చేసే చోట సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగినా ప్రభుత్వం నుంచి భరోసా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహనాయక్, జిల్లా నాయకులు ఎం.సుధాకర్, డేవిడ్, స్వాములు, ఓబులేసు, పక్కీర్‌సాహెబ్, బాషా, మద్దిలేటి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

రుద్రవరం: ఉపాధి హామీ పథకం కూలీలకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు కోరారు. సోమవారం మండల పరిధిలోని చిన్నకంబలూరులో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేతనాలు అందక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వందరోజులు పనిదినాలు పూర్తయిన వారికి అదనంగా పని దినాలు కలిపించాలని, వేసవి కాలంలో అలవెన్సులు డిమాండ్ చేశారు. చ వీటి సాధనకు మార్చి 12న విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మాన్యం భూములు రైతులకు కేటాయించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): కల్వటాల గ్రామంలో దశాబ్దాలుగా ఉన్న దేవాలయ మాన్యం భూములను బహిరంగ వేలం ద్వారా రైతులకు కౌలుకు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, ఏపీ రైతు సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి సోమన్న మాట్లాడుతూ ఎండోమెంట్ అధికారులు రామ్‌కో సిమెంట్ యాజమాన్యానికి మాన్యం భూములు రాసి ఇచ్చేలా జీఓ ఇవ్వడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో కల్వటాల గ్రామ రైతులు అబ్రహాం, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పెద్దయ్య, వినయ్, పుల్లయ్య, శీను, నాగేశ్వరరెడ్డితో పాటు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై అధికారుల సమీక్షలో కలెక్టర్



పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి, అధికారులు

నంద్యాల: కలిసికట్టుగా జిల్లాను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో అధికారులతో జిల్లా కలెక్టర్ స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లాను ముందంజలో ఉంచడంతోపాటు ప్లాస్టిక్ రహితంగా కూడా మార్చాలన్నారు. ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ప్రతి శాఖకు లాగిన్ ఇచ్చినా సదరు కార్యక్రమాలను నిర్వహించి అప్‌లోడ్ చేయడంలో ఎందుకు ఇబ్బందులు పడుతున్నారని వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ ప్రశ్నించారు. ఈనెల 15వ తేదీన జరిగే స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టరేట్ మొత్తం ప్లాస్టిక్ బ్యాన్ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శని, ఆదివారాల్లో ప్రజా ప్రతినిధులు గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతోందని సదరు అర్జీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వేసవికాలం ప్రారంభం కావడంతో సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ఉదయం 9.30 గంటలకు ప్రారంభించి మధ్యాహ్నం 12.30 గంటలకు పూర్తిచేసేలా ఆదేశించిందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్‌ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోండి

టైలరింగ్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుస్సేన్ జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ మహిళలకు జీవనోపాధి కల్పనలో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 500 మందికి శిక్షణ ఇచ్చేలా కార్యక్రమాన్ని రూపొందించామని అందుకు 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయస్సు ఉన్న మహిళలు అర్హులని వారికి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ ఉండేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,440 మందికి శిక్షణ ఇచ్చేలా ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందన్నారు.

ఉద్యోగులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఐగాట్ కర్మయోగి యాప్ ద్వారా ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జరిగిన సమావేశంలో ఐగాట్ కర్మయోగి యాప్, పీ–4 సర్వేలపై కలెక్టర్ జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

సారా నిర్మూలనకు చర్యలు

నంద్యాల: జిల్లాలో సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సారా నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 19 గ్రామాల్లో నాటుసారా తయారీ కేంద్రాలను గుర్తించామని, ఆ ప్రాంతాల నుంచి సారా రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరో 129 గ్రామాల్లో నాటు సారా విక్రయ కేంద్రాలు ఉన్నాయని వీటన్నింటినీ నిర్మూలించే బాధ్యత రెవెన్యూ, పోలీస్, అటవీ, ఎక్సైజ్ అధికారులు తీసుకోవాలన్నారు. సారా తయారు చేసే వ్యక్తులు తమకు పునరావాసం కల్పిస్తే మానుకుంటామని చెబుతారని, అలాంటి వారికి డీఆర్‌డీఏ, డ్వామా అధికారులు ఉపాధి కల్పనకు చొరవ తీసుకోవాలన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ మాట్లాడుతూ నాటు సారా తయారీ చేసే వ్యక్తులు, తరలించే వారు, విక్రయించే వారిని గుర్తించి వివరాలు సేకరించేందుకు గ్రామ, మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసు, అటవీ, ఎక్సైజ్ అధికారులతో పాటు సర్పంచులు, మహిళా సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసి గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసామన్నారు. ఈ కమిటీల ద్వారా సారా వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు, బెల్లం సరఫరా చేసే వ్యాపారులకు అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం నాటు సారా రహిత ఆంధ్ర ప్రదేశ్ దిశగా నవోదయం 2.0 పోస్టర్‌ను కలెక్టర్, జేసీలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, డీఆర్‌ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైద్య పరికరాల వినియోగంపై అవగాహన

గోస్పాడు: అత్యవసర పరిస్థితుల్లో వైద్య పరికరాలను సక్రమంగా వినియోగించాలని నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ జిలానీ అన్నారు. వైద్య పరికరాల నిర్వహణపై సైరిక్స్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థ డివిజనల్ మేనేజర్ దామోదర్ మాట్లాడుతూ వైద్య పరికరాలను వినియోగించే పద్ధతులపై నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఓడీ డాక్టర్ మదన్‌మోహన్‌రావు, నర్సింగ్ సూపరింటెండెంట్, బయోమెడికల్ ఇన్‌చార్జ్ ఇంజినీర్ పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లీ దీవించు!



సరస్వతీ పూజ చేస్తున్న దృశ్యం



కార్యక్రమాన్ని తిలకిస్తున్న బాలబాలికలు

రుద్రవరం: స్థానిక శ్రీకన్యకా పరమేశ్వరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సరస్వతీ పూజ నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని చదువుల తల్లీ తమను దీవించు అంటూ భక్తిశ్రద్ధలతో పూజించారు. పరీక్షలకు ముందు అమ్మవారికి పూజలు చేస్తే శుభసూచకమని వేదపండితులు గోపిశర్మ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు బస్సులో ఉచిత ప్రయాణం

నంద్యాల(వ్యవసాయం): పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఈనెల 17 నుంచి ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ జిల్లా రవాణా అధికారి రజియా సుల్తానా, డిపో మేనేజర్ గంగాధర్‌రావు తెలిపారు. పరీక్షలు ఉన్న రోజుల్లో హాల్‌టికెట్ చూపిస్తే పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో కేంద్రం వరకు తీసుకెళ్లి వదులుతామన్నారు. ఈ అవకాశాన్ని పదోతరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యువత పోరును విజయవంతం చేద్దాం



దొర్నిపాడులో యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



శిరివెళ్లలో ...



చాగలమర్రిలో ..

దొర్నిపాడు: విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిరంకుశ వైఖరికి నిరసనగా ఈనెల 12 న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నంద్యాలలో చేపడుతున్న యువత పోరు కార్యక్రమాన్ని కలిసికట్టుగా విజయవంతం చేద్దామని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. యువత పోరుకు విద్యార్థులు, నిరుద్యోగులు వేలాదిగా తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఆపార్టీ నాయకులు సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. దొర్నిపాడులో మండల కన్వీనర్ బత్తుల నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు రూ.3వేల భృతి ఇవ్వలేదన్నారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా చంద్రబాబు విద్యార్థుల గోడు పట్టించుకోవడం లేదన్నారు. బడ్జెట్‌లో కూడా నిధులు కేటాయించలేదన్నారు. సర్కారు తీరుపై నిరసన తెలిపేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు , నిరుద్యోగులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, రామనాథ్‌రెడ్డి, అక్కల గోపాల్, దస్తగిరి, శ్రీపతి ప్రసాద్, బత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: ఈ నెల 12వ తేదీన నంద్యాలలో యువత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. అబ్దుల్ సలాం, మాజీ జెడ్పీటీసీ నజీర్ తెలిపారు. సోమవారం పార్టీకార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. వైఎస్ జగన్ పాలనలో విద్యార్థులకు క్రమం తప్పకుండా విద్యా దీవన, వసతి దీవన డబ్బులు విడుదల అయ్యేవన్నారు. కూటమి సర్కారు వచ్చాక ఆ ఊసే లేదన్నారు. 5 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నాడు యువగళంలో లోకేష్ ప్రకటించి నేటికి అమలు చేయలేదని మండిపడ్డారు. అందువల్లే నిరుద్యోగ యువతకు మద్దతుగా తమ పార్టీ పోరు బాట పట్టిందన్నారు. కార్యక్రమంలో స్టేట్ హిస్టరీ మాజీ డైరెక్టర్ హఫీజ్, ఉప సర్పంచు ఇంతియాజ్, మాజీ మండల ఉపాధ్యక్షుడు కుల్లాయప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీగా తరలిరండి

చాగలమర్రి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 12న జరిగే యువత పోరు కార్యక్రమానికి మండలంలోని నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎంపీపీ వీరభద్రుడు పిలుపునిచ్చారు. ఆయన సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో యువత పోరు పోస్టరును ఆవిష్కరించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. నిరుద్యోగులకు నేటికి రూ.3 వేల భృతి ఇవ్వడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.4,600 కోట్ల విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సర్పంచ్ గోవిందయ్య పార్టీ నాయకులు రంగయ్య, శ్రీనివాసులు, మస్తాన్, బాష పాల్గొన్నారు.